ప్రజాశక్తి

బుధవారం 13 డిసెంబరు 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

మచిలీపట్నంలో ధర్నా చౌక్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సమ్మె శంఖారావం

- మూతపడిన అంగన్వాడీ కేంద్రాలు
- ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలవ్యాప్తంగా అంగన్వాడీల నిరసన
- ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్

కానూరులోని ఐసిడిఎస్ పీడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుండి ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల వ్యాప్తంగా అంగన్వాడీలు నిరవధిక సమ్మెకు దిగారు. అంగన్వాడీ సెంటర్లను మూసివేసి ఆందోళనలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అన్ని ఐసిడిఎస్ కార్యాలయాలు, జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయాల వద్ద పెద్దఎత్తున ధర్నాలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని అంగన్వాడీలు విజయవాడ సమీపంలోని కానూరులో గల ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద, కృష్ణాజిల్లాలోని అంగన్వాడీలు మచిలీపట్నం కలెక్టరేట్ సమీపంలోని ధర్నా చౌక్ వద్ద ధర్నాలు చేపట్టారు. ఆయా జిల్లాల నుండి పెద్దఎత్తున అంగన్వాడీలు తరలివచ్చి ఆందోళనల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై గళమెత్తారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినదించారు. ఆయా జిల్లాల్లోని అనేక కేంద్రాల్లోనూ ధర్నాలు నిర్వహించారు. కానూరులో జరిగిన కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు డివి.కృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.గజలక్ష్మి, ఎన్.సిహెచ్.సుప్రజ, ఎస్ జైనీ రతన్ కుమారి, ఎల్లారాణి, ఎ.ఉమాదేవి, స్వప్న, కళ్యాణి పాల్గొన్నారు. ఎఐటియుసి నాయకులు లీలమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు పోలారి పాల్గొని మద్దతు తెలిపారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)

అండర్-19 జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

దేశం నలుమూలల నుంచి వచ్చిన 325 మంది క్రీడాకారులు

జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం; హాజరైన క్రీడాకారులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సాంస్కృతిక కళాత్మక కార్యక్రమాల వైభవం.. భారతీయ క్రీడాస్ఫూర్తి తరంగాల కీర్తి పతాకాల మధ్య మంగళవారం నగరంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రాంగణంలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంటు ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. విద్యార్థుల నత్య ప్రదర్శనలు, దేశం నలుమూల నుంచి వచ్చిన క్రీడాకారుల కేరింతలతో ప్రాంగణం హోరెత్తింది. అనంతరం ముఖ్య అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి మెగా క్రీడా ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్‌జీఎఫ్ఐ, ఎస్‌జీఎఫ్ ఏపీ, కళాశాల పతాకాలను ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, టోర్నమెంటు నేషనల్ అబ్జర్వర్ రాజురాణా, టోర్నమెంటు కన్వీనర్ సి.శివ సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. 25 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. అనంతరం క్రీడాకారులతో క్రీడాస్ఫూర్తి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ముఖ్య అతిథులు ప్రసంగించి.. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగు నేలపై నుంచి పుల్లెల గోపీచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధు వంటి గొప్ప క్రీడాకారులు తమ ఆట ద్వారా భారతీయ క్రీడా ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ టోర్నమెంటు గొప్ప వేదికన్నారు.

రైతన్నకు ఊరటేది?

- ధాన్యం సేకరణ నిబంధనల్లో సడలింపు శూన్యం
- అదనపు తూకంతో రైతులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న రైతులకు ఊరట దొరకడం లేదు. ప్రభుత్వం ధాన్యం సేకరణకు జారీ చేసిన నిబంధనలను కనీసం సడలించడంలేదు. దీంతో తడిసి నాణ్యత కోల్పోయిన ధాన్యం కనీస మద్దతు ధరలోనూ భారీగా కోత పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంట కోతకొచ్చే సమయంలో వచ్చిన తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులు, కురిసిన భారీ వర్షాలతో ధాన్యం తడిసిపోయింది. పొలాల్లో పనులు నేలవాలి నీట మునిగాయి. దీంతో ధాన్యం నాణ్యతపై ప్రభావం పడింది. ఇటువంటి సందర్భాల్లో ధాన్యం సేకరుణ నిబంధనలు కొంతమేర సడలించి రైతులు పూర్తిగా నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యం సేకరణకు సంబంధించి నిబంధనలు సడలించలేదు. కనీస మద్దతు ధరకు నిర్ణయించిన నాణ్యతా ప్రామాణాల్లో సడలించి రైతులకు ప్రయోజనం కలిగించే 17 శాతం తేమతోపాటుగా వ్యర్థ పదార్థాలు, మట్టి, రాళ్లు, పెళ్లలు ఒక శాతానికి, చెత్త తాలు ఒకశాతం, దెబ్బతిన్న, రంగుమారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యపు గింజలు 5 శాతం, పరిపక్వం కాని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన గింజలు 3 శాతం ఉన్న ధాన్యానికి కామన్ రకం 75 కిలోల బస్తాకు రూ.1637కు గ్రేడ్ ఏ రకం రూ. 1652కు కొనుగోలు చేస్తున్నారు. తడిసిన ధాన్యం రంగుమారడంతోపాటు తుపానుకు నేలవాలిన పంటలో మొలకలు, మట్టి పెళ్లలు ఎక్కువగా వస్తాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తేమశాతం ఎంత ఉన్నా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టి రైతులకు ఊరట కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అయితే నిబంధనల ప్రకారం 17 శాతానికి మించి తేమ ఉన్న ధాన్యంలో ఒక్కో పాయింట్‌కు ఒక కిలో ధాన్యం తరుగు పేరుతో రైస్ మిల్లర్లు తీసుకుంటున్నారు. 75 కిలోల బస్తాకు 4 నుంచి 8 కిలోల వరకు కోల్పోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. తాజాగా తుపానుకు నేలవాలిన, పనలపై తడిసిన పంటల్లో వచ్చేమట్టి పెళ్లలు, మొలకెత్తిన గింజల శాతాన్ని సాకుగా చూపి మిల్లర్లు బస్తాకు కనీసంగా 10 కిలోల వరకు ధాన్యం అదనంగా తరుగు కింద మినహాయించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఒక్కో బస్తాకు రూ.218.30 నుంచి రూ.220.30 వరకు మద్దతు ధరలో కోత పడుతుందని రైతులు వాపోతున్నారు. తుపానుకు దెబ్బతిన్న రైతులకు పంట నష్ట పరిహారం, బీమా అందించడంతోపాటు రైతులకు ప్రయోజనం కలిగేలా ధాన్యంం సేకరణ నిబంధనలు సడలించాలని రైతులు కోరుతున్నారు.

అవనిగడ్డ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

డిఎస్‌సి అభ్యర్థుల ధర్నా

వార్త 7లో

టిడిపి నేతల ఫీట్లు

- టికెట్ కోసం పోటాపోటీగా సమావేశాలు
- తామే అభ్యర్థులమని ఎవరికి వారే ప్రకటనలు
- అయోమయంలో పార్టీ శ్రేణులు
- పొత్తుతో జనసేన శ్రేణుల్లోనూ ఆశలు
- హాట్‌టాపిక్‌గా విజయవాడ పశ్చిమం

వెంకన్న

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అప్పుడే విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయం హీటెక్కింది. అధికార పార్టీ అభ్యర్థి ఎవరనే అంశం పక్కన పెడితే ప్రధాన ప్రతిపక్షం టిడిపిలోనే కుమ్ములాటలు మొదలయ్యాయి. ఆ పార్టీ నేతలు పోటాపోటీగా సమావేశాలు పెట్టుకుంటూ 2024 ఎన్నికల్లో తామే అభ్యర్థులమని ఎవరికి వారే సంకేతాలు ఇస్తున్నారు. దీంతో తమ పార్టీ అభ్యర్థి ఎవరో తెలియక టిడిపి శ్రేణులు గందరగోళానికి గురవుతున్నాయి. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) పశ్చిమ అభ్యర్థిగా ఎంఎస్.బేగ్‌ను ప్రకటించడం మరింత చర్చనీయాంశంగా మారింది. మరోవైపు మాజీ ఎంఎల్ఎ జలీల్ ఖాన్ ఆదివారం వన్‌టౌన్లో నిర్వహించిన సమావేశంలో పార్టీ అధిష్టానం తనకు టికెట్టు ఇచ్చేందుకు హామీ ఇచ్చిందని ప్రకటించారు. అభ్యర్థులను ప్రకటించే హక్కు పార్టీ అధినేత చంద్రబాబుకు తప్ప ఎవరికీ లేదని చెప్పుకొచ్చారు. అంతేగాక ఎంపి కేశినేని నానిని పరోక్షంగా టార్గెట్ చేస్తూ అభ్యర్థులను ప్రకటించే హక్కు ఆయనకు లేదన్నారు. మాజీ ఎంఎల్‌సి బుద్దా వెంకన్న కూడా ఆదివారం తన అనుయాయులతో సమావేశమయ్యారు. తాను టిడిపి తరపున పోటీకి సిద్ధమని సంకేతాలిచ్చారు. మరోవైపు

జలీల్‌ఖాన్

బేగ్

(మిగతా 6లో)

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ జగన్మోహన్‌రావు

రోగులతో మర్యాదగా నడుచుకోవాలి

ప్రజాశక్తి - నందిగామ : ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది చూడాలని వారితో మర్యాదగా వ్యవహరించాలని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్‌మోహన్‌రావు సూచించారు. నందిగామ ప్రభుత్వాసుపత్రిలో 'హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ' సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. తాగునీరు – పారిశుధ్యం విషయాల్లో జాగ్రత్త వహించాలని.. రోగులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 6వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజ్ స్లాబ్ పనులను పరిశీలించారు. రూ.60 లక్షల నిధులతో స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ నిర్మిస్తున్నామని, డ్రైనేజీపై పూర్తిస్థాయిలో స్లాబ్ నిర్మాణం చేసి "వాక్ వే" లా మార్చేలా రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఇ ఫణి శ్రీనివాస్, ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ గుడివాడ సాంబశివరావు, సూపరిండెంట్ సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు .

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో యువతకు ఆడుదాం ఆంధ్ర పోటీలకు క్రీడా కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈనెల 15 నుంచి 20వ తారీకు వరకు గ్రామస్థాయిలో, 21 నుంచి జనవరి నాలుగో తారీఖు వరకు మండల స్థాయిలో కబాడీ, వాలీబాల్, టెన్నికాయిడ్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటల పోటీలు పురుషులు, స్త్రీలకు వేరుగా నిర్వహించబడతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకష్ణ నాయక్ తెలిపారు. ఆటలు ఆడటానికి క్రీడా కిట్లను ప్రతి గ్రామ సచివాలయానికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు గరికపాటి శ్రీదేవి ఎంపిపి పాలడుగు జ్యోత్స్న, సచివాలయ సిబ్బంది ఎంపిటిసి మెంబర్లు సర్పంచులు పాల్గొన్నారు.

లంక భూములకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండల కొత్తపేట గ్రామంలో లంక భూములు సాగు చేసుకుంటున్న పేదలకు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సంపత్ కుమార్ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావుతో కలిసి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో లంక భూములు క్రయవిక్రయాలు చేయకూడదని నిబంధన ఉండేదని, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధన సడలించి ఆ భూములు తనకా పెట్టుకోవటానికి కానీ, ఇతరులకు అమ్ముకోవటానికి అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటికే సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శంకరబాబు, డిటీ నాగులు మీరా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తంగిరాల సౌమ్య

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి కంచికచర్ల : కంచికచర్ల ఓసి క్లబ్ సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిం చారు. ఐక్య గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలలో దైవ సేవ కుల ఆధ్వర్యంలో నిర్వ హించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగి రాల సౌమ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ

పలుచోట్ల అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగవాడీల సమస్యలు పరిష్కరించడంలో తీవ్రంగా జాప్యం చేస్తున్నాయని, వేతనాలు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అములు చేయాలని, ఇతర సమస్యలపై అనేక మార్లు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తులు చేశామని అన్నారు. మార్చి 23న శాసనమండలిలో ఐసిడిఎస్ మంత్రి అంగన్ వాడీ యూనియన్లతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీ ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. అక్టోబర్ 3న అధికారులతో జరిగిన చర్చలలో అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాలేదని ఈ నేపథ్యంలోనే నిర్వహిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్ మరి కొంతమంది నాయకులు, జగ్గయ్యపేట, చిల్లకల్లు ఎస్సై ఆనంద కుమార్, కృష్ణ బాబులు తమ సిబ్బందితో హుటాహుటిన ధర్నా చేస్తున్న ప్రాజెక్ట్ కార్యాలయం వద్దకు వచ్చారు. అంగన్వాడి నాయకులు వర్కర్లతో మాట్లాడి ధర్నాను విరమించాలని కోరారు. అయినప్పటికీ అంగన్వాడీ నాయకులు, కార్యకర్తలు ధర్నాను విరమించేది లేదని, మాకు న్యాయం జరిగేంత వరకు ఇక్కడి నుంచి కదలబోమని తెలిపారు. దీంతో నాయకులు, పోలీస్‌లు వెను తిరిగారు. అంగన్వాడీ వర్కర్లు ఆయాలు చేస్తున్న ధర్నాకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాము, ప్రజా సంఘాల నాయకులు ఎస్ నాగమణి, కోటా కృష్ణ, డి.నాగేశ్వరరావు, షేక్ గౌస్ మియా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి మధు కుమారి, అంజమ్మ, సువర్చల, రత్నకుమారి, మేరమ్మ, విశాలాక్షి, జానమ్మ, నాగ చంద్రిక, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు. **నందిగామ :** అంగనవాడీ వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నందిగామ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగనవాడీ వర్కర్స్ ధర్నా నిర్వహించారు. నందిగామ, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు, పెనుగంచిప్రోలు మండలాల నుండి పెద్ద సంఖ్యలో అంగనవాడీ వర్కర్స్ తరలివచ్చారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్ మాటాడారు.

షామియానా టెంట్లు వేయవద్దంటూ కౌన్సిలర్ భర్త దబాయింపు : అంగనవాడీ వర్కర్స్ ధర్నా చేస్తున్న ప్రదేశంలో షామియానా టెంట్లు వేయవద్దంటూ 16వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భర్త అచ్చిపెదబాబు అడ్డు తగిలారు. తన పరిమిషన్ లేకుండా తన వార్డులో ధర్నా చేయవద్దని హుకుం జారీ చేశారు. ఎండలో అంగనవాడీ వర్కర్స్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద షామియానా టెంట్లు లేకుండా ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కొల్లి సరళ, వెంకట్రావమ్మ, సుజాత, ఏసోబు తదితరులు పాల్గొన్నారు. **చందర్లపాడు:** విజయవాడలో జరిగే 36 గంటల వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చందర్లపాడు, చింతలపాడు పిహెచ్‌సిల వైద్యులు దివిజకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతలపాడు పిహెచ్.సి నుండి చందర్లపాడు సిఐటియు అధ్యక్షురాలు ఈదర కమల, సబ్ సెంటర్ నాయకులు పాల్గొన్నారు. **విస్సన్నపేట :** తెల్ల దేవరపల్లి పీహెచ్‌సి డాక్టర్ శ్రీనివాసరావుకు ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు నాగరాజు ఆశ వర్కర్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. తిరుపతమ్మ ప్రమీల కల్పన జయశ్రీ సరూప జ్యోతి మేరీ పుష్ప రాణి పాల్గొన్నారు ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నాగరాజు మాట్లాడారు. **తిరువూరు :** అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె తిరువూరులో కొనసాగింది. ఈసందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు బోసుబొమ్మ సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీదగా ర్యా లీ నిర్వహించి కనకదుర్గమ్మ గుడి రోడ్ లోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా చేశారు. ప్రభుత్వం సమస్యలు పరి ష్కరించే అంతవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.కమల అన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి ప్రధానమైన డిమాండ్ల పరిష్కా రానికి ఒప్పుకోకుండా అంగన్వాడీ కార్యకర్తలకు ఆయా లకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంక టేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎస్.వి భద్రం, అంగ న్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

విస్సన్నపేటలో వినతి పత్రం ఇస్తూ...

తిరువూరులో...

నందిగామలో...

చందర్లపాడులో...

వరి, మిర్చి పంటలను పరిశీలించిన గద్దె

పెనుగంచిప్రోలు : తుపాను కారణంగా పూర్తిగా దెబ్బతిన్న వరి, మిర్చి పంటపొలాలను జనసేన, టిడిపి రైతు సంఘం బృందం మంగళవారం మండలంలో పరిశీలించింది. విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, రాష్ట్ర తెలుగు రైతు సంఘం అధ్యక్షులు మర్రి రెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొతారు సత్యనారాయణ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా దేశం రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరు రాజేశ్వరరావు, నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు బాడిస మురళీకష్ణ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్యల బృందం మండల పరిధిలోని అనిగండలపాడు గ్రామ పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టానికి పరిహారం అందించి రెండో పంటకు నూరు శాతం రాయితీపై విత్తనాలను తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ఎకరానికి రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చింతల సీతారామయ్య, జగ్గయ్యపేట మండల టిడిపి అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, నందిగామ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, నాయకులు రైతులు, పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ గద్దె రామ్మోహన్‌రావు

పేద విద్యార్థికి సాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రమేష్ గజవల్లి, దీప పబ్బతి (యుఎస్‌ఎ)ల 25వ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని పేద విద్యార్థికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. తాను యుఎస్‌ఎలో ఉండటం వల్ల విద్యార్థికి అకౌంటు ద్వారా సాయం అందజేసినట్లు తెలిపారు.

గ్రామీణ డాక్ సేవకుల సమ్మె

ప్రజాశక్తి-గంపలగూడెం: 8 గంటల పనితో పాటు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని మండల వ్యాప్తంగా ఉన్న గ్రామీణ డాక్ సేవకులు పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుండి దేశవ్యాప్తంగా జరుగు నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక తపాలా కార్యా లయం ఎదుట సేవకులు నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజ్ 5 లక్షలకు పెంచాలని, డిపార్ట్మెంట్ స్టాఫ్‌తో సమానంగా జిడిఎస్ గ్రాడ్యుటి పెంచాలని, తెలిపారు.

సమ్మెచేస్తున్న డాక్ సేవకులు

ముస్లిములను మోసగించడం తగదు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ముస్లింలకు స్థలం కేటాయించినట్లు మభ్యపెట్టి మోసం చేయడం సామినేని ఉదయభానుకు తగదని శ్రీరాం రాజగోపాల్ విమర్శించారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రంజాన్ పండుగ సందర్భంగా జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ సామినేని ఉదయభాను కోదాడ రోడ్లో గల జెడ్పి స్థలంలో 72 సెంట్లు ముస్లింల షాదీఖానాకు కేటాయిస్తున్నట్లుగా ప్రకటించారని ఇంత వరకు అది కార్యరూపం దాల్చలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ సత్తార్, పట్టణ పార్టీ అధ్యక్షులు మైకా వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సయ్యద్ అన్వర్, విజయవాడ పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శి పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రహదారులపై ఉన్న ధాన్యాన్ని వెంటనే వాహనాలు ఏర్పాటు చేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం సేకరణ, ఓటర్ల జాబితా సవరణ, లంక భూముల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని ఎక్కువ రోజులు రహదారులపై ఆరబెట్టుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆరబెట్టుకున్న ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలు లేవని, ఎవరు పట్టించుకోవడంలేదని ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. వాహనాల కొరత ఎట్టి పరిస్థితుల్లో రాకూడదని స్పష్టం చేశారు. తుపాను వల్ల దెబ్బతిన్న పంటల నష్టం వివరాలను ముమ్మరంగా ఎన్యుమరేషన్ చేపట్టి 18వ తేదీ కల్లా పూర్తి చేయాలన్నారు. ఆ వివరాలను 22వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం అందుబాటులో ప్రదర్శించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరించిన వివిధ రకాల దరఖాస్తుల వివరాలను తెలియజేస్తూ బిఎల్ఓల నుండి ధ్రువీకరణ పత్రం వెంటనే పొందాలన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. లంక భూముల ఈకేవైసి చేయడంలో నాగాయలంక వెనుకబడి ఉందని ఇకనైనా పురోగతి సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.రాజు, మచిలీపట్నం గుడివాడ ఆర్డీవోలు ఎం వాణి, పద్మావతి, డిఎస్ఓ పార్వతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర ప్రదర్శన

ఓటు హక్కును అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకుని దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడంపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విధానాన్ని స్వయంగా డెమో ద్వారా సందర్శకులకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటర్లకు అవగాహన కలిగించేందుకు కలెక్టరేట్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ప్రదర్శన కేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమం 40 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి సురేష్, కలెక్టరేట్ ఏవో రాధిక తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టంను పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి జి.గీతాబాయి స్పష్టం చేశారు. మంగళవారం మచిలీపట్నం లోని శ్రీ సాయి రక్షిత స్కానింగ్ కేంద్రం, రాజీవ్ స్కానింగ్ కేంద్రంను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా పిసిపిఎన్డిటి చట్టం పరిధిలో నమోదు చేయవలసినదిగా ఆదేశించారు. ఎవరైనా లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు . అవసరమైతే ఐఎంఎ గుర్తింపును కూడా రద్దు చేయడం జరుగుతుందన్నారు, ముఖ్యంగా జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి గల ప్రాంతాలను గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రజలలో అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులన్నీ కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. స్కానింగ్ కేంద్రాల వారు తమ కేంద్రాలకు వచ్చిన గర్భవతులు యొక్క పూర్తి వివరాలను మరియు అనుమతిని తీసుకొని మాత్రమే స్కానింగ్ నిర్వహించచలన్నారు.ప్రతి గర్భవతి యొక్క వివరాలను ఫారం ఎఫ్ అప్లికేషను ద్వారా ఆన్లైన్ చేయలన్నారు. ముఖ్యంగా గర్భవతులు మరియు వారి సంబంధీకులు స్కానింగ్ కేంద్రాలకు వెళ్లి ఆడ , మగ అని తెలుసుకోరాదన్నారు. లింగ నిర్ధారణ చేయుచున్న వారి సమాచారం తెలిపినచో వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచి ఆయా కేంద్రాలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు బి. రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

'ఆశాల ధర్నాను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఆశ కార్యకర్తలను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.రాజేష్ డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14 ,15 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే వంటావార్పు కార్యక్రయాన్ని జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం ఉయ్యూరులో జరిగిన సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఆశాలకు పని భారం తగ్గించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా ఆశాలను మార్పు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ వంటి వసతులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు తహీర బేగం శంషా బేగం, బస్వంతి, పరిశుద్ధం తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో...

బంటుమిల్లి: బంటుమిల్లిలో ఆశ వర్కర్లు నిరసన తెలిపారు. కనీస వేతనం చెల్లించాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి ధనశ్రీ, బొర్రా రత్నకుమారి, విజయలక్ష్మి, తంటేపూడి లలిత, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో...

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పెదపారుపూడి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసి వారిని ఆణిముత్యాలుగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను తీసుకొచ్చారని ఎంపీగోగం సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలమంలో ఎంపిపి గోగం సురేష్ స్పోర్ట్స్ కిట్స్‌ను సచివాలయంకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో గోళ్ల సోమేశ్వరరావు, ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి, ఎన్‌వి రమణరావు పాల్గొన్నారు.

వరికుప్పకు నిప్పు

ప్రజాశక్తి-ఉయ్యూరు: ముదునూరులో కుర్రా శివప్రసాద్‌కు రెండు ఎకరాల వరికుప్పకు సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వ్యవసాయం చేసుకుని జీవించే శివప్రసాద్ వర్షాలకు ముందు కోతకోసి కట్టి కుప్ప వేసుకోగా గుర్తుతెలియని వారు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లిన శివప్రసాద్ కుప్ప కాలిపోయి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'ఖాదీజా' సేవలను సద్వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పేద వర్గాల మహిళల కోసం ఖాదీజా ఫౌండేషన్స్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని డిటిసి డిఎస్‌పి రమేష్ బాబు పేర్కొన్నారు. ఖాదీజా ఫౌండేషన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు అతి తక్కువ సమయంలోనే మంచి డిజైన్ దుస్తులు తయారు చేసిన వారికి ఫౌండేషన్స్ ట్రస్ట్ అందించిన నగదు బహుమతులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పేద వర్గాల మహిళల కోసం ఖాదీజా ఫౌండేషన్స్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అన్నారు. శిక్షణతో పాటు శిక్షణ పూర్తి అయిన తర్వాత ఉచితంగా కుట్టు మిషన్‌లు కూడా అందించడం సంతోషదాయకం అన్నారు. మేనేజింగ్ ట్రస్టీ సమాన మూసవి మాట్లాడుతూ మచిలీపట్నంలోని నిరుపేద ముస్లిం మహిళలకు సాధికారత కల్పించడానికి ఖాదీజా ఫౌండేషన్స్ ట్రస్ట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ఉచిత శిక్షణా కార్యక్రమం మూడు నెలల పాటు ఉంటుందని, ఇందులో నేటి మార్కెట్‌లో ఖచ్చితమైన వస్త్రాలను తయారు చేయడానికి అవసరమైన అన్ని నైపుణ్యాలను శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి అల్తాఫ్ హుస్సేన్, మొహమ్మద్ ఇమ్రాన్, షిబా అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని విన్నకోట గ్రామ సచివాలయంలో 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎన్‌టిఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ రవి కుమార్, సర్పంచ్ ముత్యాల సాంబయ్య పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని తాడంకి సచివాలయం వద్ద మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్, గ్రామ సర్పంచ్ జంపాల ధనలక్ష్మి, ఏనుగు మస్తానరావు, సొంటి వెంకటేశ్వరరావు, కంభం రాంబాబు పాల్గొన్నారు.



పమిడిముక్కలలో...

అపరిశుభ్రంగా చల్లపల్లి రైతుబజార్

- రోజుల తరబడి ఎక్కడి చెత్త అక్కడే
- డ్రైనేజీ సమస్యతో వర్షం నీరు నిల్వ

ప్రజాశక్తి-చల్లపల్లి

మండల కేంద్రమైన చల్లపల్లిలోని రైతు బజారు డంపింగ్ యార్డును తలపిస్తోంది. నిత్యం కొనుగోలుదారులతో రద్దీగా ఉండే ఈ రైతు బజార్ నేడు దోమలకు, అపరిశుభ్రతకు నిలయంగా మారింది. డ్రైనేజీ మార్గం లేకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలకు నిలయంగా మారింది. ఫలితంగా కూరగాయలు కొనేందుకు వచ్చే వినియోగదారులు, కూరగాయలు అమ్మే రైతులు పట్టపగలే దోమకాట్లకు గురవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. సౌకర్యాలు సమకూర్చాల్సిన పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు బయటకు పోయే పరిస్థితి లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో రైతులే స్వచ్ఛందంగా మురుగునీటిని బకెట్లతో తోడి బయట పారబోసిన సందర్భాలూ లేకపోలేదు. రైతు బజార్ ప్రారంభించిన దగ్గర నుంచి నేటి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ఇప్పటివరకు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు. రైతు బజారు లోపల లోతట్టుగా ఉన్న నేలను మెరక చేయడంలోగానీ, వర్షపు నీరు బయటకు పోయేలా చూడటంలోగానీ మార్కెటింగ్ శాఖ అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ అధికారులు రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి, దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకండి అంటూ ప్రచారాలకు పెద్ద పీట వేసే అధికారులు రైతు బజార్ పరిశుభ్రత గురించి పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రైతు బజారులో ఎప్పటి చెత్తను అప్పుడు తరలించే చూడాలని, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వర్షం నీరు నిలబడకుండా మెరక తోలాలని, డ్రైయినేజీ సమస్యలను పరిష్కరించాలని రైతులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న డిజిపి విశాల్ గున్నీ

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిసిపి విశాల్ గున్ని

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కి సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం విజయవాడ డిసిపి విశాల్ గున్నీ విచ్చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిసర ప్రాంతాలను, పరిశుభ్రతను, మెయింటెనెన్స్‌ని, రికార్డ్ కీపింగ్‌ని కాలింగ్ ఇతర విషయాలను పరిశీలించడానికి ఇబ్రహీంపట్నం వచ్చినట్లు తెలిపారు. స్టేషన్ రివ్యూలో భాగంగా వెస్ట్ జోన్ పరిధిలో వన్‌టౌన్ టూటౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. పవిత్ర సంఘంలో భద్రత కట్టుదిట్టం చేసామని నైట్ బీట్స్ కూడా ఉన్నట్లుగా తెలిపారు. ఇందులో ఏ సి పి హనుమంతరావు, సీఐ శ్రీను ఇతర ఎస్ఐలు పాల్గొన్నారు.

కెవిఆర్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ కాకాని వెంకటరత్నం కళాశాలలో ఫ్రెషర్స్‌డే ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయప్ప పర్యవేక్షణలో నిర్వహించారు. రాయప్ప మాట్లాడుతూ కెవిఆర్ కాలేజి 55 సంవత్సరాల నుండి నందిగామ ప్రాంత నిరుపేద విద్యార్థులకు ఉచిత సేవ అందిస్తుందని తెలిపారు. ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహించటంలో గొప్ప పాత్రను పోసించిందన్నారు. ఈ కళాశాలలో ఉన్న అనేక సౌకర్యాలను, ఉపయోగించుకుని బాగా చదువుకొని బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బాలికను నిర్బంధించిన తండ్రి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: కన్నతండ్రి, నాయనమ్మలే బాలికను బాత్‌రూంలో నిర్బం ధించిన బాధాకరమైన సంఘటన జగ్గయ్యపేటలో వెలుగు చూసింది. వివరాల ప్రకారం... పట్టణంలోని నాగమయ్య బజార్, మసీదు సమీపంలో నక్కని ప్రవీణ్ తన తల్లి గోవర్ధనమ్మ, కుమార్తె లోహితతో కలిసి ఉంటున్నాడు. ప్రవీణ్ భార్య మూడేళ్ల క్రితం మృతిచెందింది. ప్రవీణ్ కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. ప్రవీణ్ భార్య మరణానంతరం కుటుంబ తగాదాల వల్ల లోహిత ఇంటి నుండి పారిపోతుందేమో అని బాత్‌రూమ్‌లో నిర్బంధించి ఉంచారు. ఆహారం కూడా సరిగా పెట్టకుండా సొంత తండ్రి నాయనమ్మలే ఇబ్బందికి గురిచేసినట్లు స్థానికులు చెబుతున్నారు. పారిపోకుండా ఉండేందుకు ఇంటిపైన ముళ్లకంపను కూడా వేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు లోహితను ఐసిడిఎస్‌కు అప్పగించి, బాలికను నిర్బంధించిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

ఇవిఎంలపై ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 84 - జగ్గయ్యపేట నియోజక వర్గ పరిధిలో గల పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఈవీఎం, వివిపిఎటిఎస్ పై మంగళవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం, చిల్లకల్లు గ్రామ సచివాలయం పోలింగ్ బూత్ నెంబరు 73 నుండి 79 ల పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కార్యాలయంలో 186 మంది, చిల్లకల్లు గ్రామ సచివాలయంలో 140 మంది ఓటర్లు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో ఉడా కాలనీ వాసులు: టిపిఎ

మాట్లాడుతున్న ఆంజనేయులు

ప్రజాశక్తి - విజయవాడ: రాజీవ్ నగర్ ఉడా కాలనీ పరిసర ప్రాంతంలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ట్యాక్స్ పేయర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.సాంబి రెడ్డి కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులు అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉడా కాలనీలో వర్షపు నీరు నిలిచిపోయి జమ్ము, మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని జమ్ము దూది గాలికి నివసించే ఇళ్లల్లోకి వస్తుందని అన్నారు. నీరు నిలిచి ఉండటంతో పిచ్చి మొక్కలు మొలవడంతో పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయని దాని వల్ల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని కార్పొరేషన్ వారికి ఫిర్యాదు చేయటానికి వెళ్ళగా వారి వద్ద హుడా కాలనీ ఖాళీ స్థలాల యాజమాన్యాల అడ్రస్సులు లేవని తేలడంతో ఖంగుతిన్నామన్నారు. కాలనీలో ఖాళీ స్థలాల యాజమాన్య పేర్లు గాని వారి అడ్రసులు గాని నగర కార్పొరేషన్ దగ్గర ఉండకపోవడంతో ఏం చేయాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఖాళీ స్థలాల వివరాలు కార్పొరేషన్ దగ్గర లేకపోతే తాము ఎవరికి తెలియజేయాలని ఆందోళన చెందుతున్నారన్నారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ సమయంలో కొనుగోలు చేసే వారి పేరు మార్పు కోసం వసూలు చేసే ఛార్జీలు వసూలు చేస్తారు కానీ మున్సిపల్ రికార్డులో మాత్రం ఆస్తి కొనుగోలు దారుని పేరు మీద మారదు మున్సిపల్ రికార్డుల్లో పేరు మారాలంటే మరలా ప్రతి లక్షకు 250 రూపాయలు చొప్పున ఆస్తి విలువ ఎన్ని లక్షలు అయితే అంత ఫీజు కార్పొరేషన్ చెల్లించాల్సి వస్తుందన్నారు. పేరు మార్చుకున్నవారి విరాలు లేకపోతే ఖాళీ స్థలాల అభివద్ధి కోసం యజమానులను గుర్తించే గుర్తించే అవకాశం లేకపోయిందన్నారు. ఈ సమస్యపై కార్పొరేషన్ స్పందించకపోతే త్వరలో కాలనీవాసులతో పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్యాక్స్ ప్లేయర్ అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

బీమా పథకం సక్రమంగా అమలుచేయాలి

సిపిఎం కార్పొరేటర్ బి.సత్యబాబు

బీమా పథకం అందజేస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కస్తూర్బా ఆశ్రమం వద్ద నివాసమున్న వాడరేవు రాజేశ్వరి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యురాలు అక్క తుమ్మ తులసికి వైయస్సార్ బీమా నిమిత్తం ముందుగా పదివేల రూపాయలు కార్పొరేటర్ బోయి సత్యబాబు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా పథకం గతంలో కుటుంబ సభ్యులందరికీ 18 ఏళ్లు వచ్చిన వారికి అమలు జరిగే విధానాన్ని తీసుకురావాలని కోరారు. బీమా మరణించిన కుటుంబ సభ్యులకు 30 రోజుల్లో అందే విధానం అమలు చేయాలి. భీమా ప్రీమియం సహజ మరణానికి ఐదు లక్షలు పెంచాలని. యాక్సిడెంట్ మరణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఆరు మాసాలుగా చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు భీమా బకాయిలు మొత్తం వెంటనే చెల్లించాలని, గత ప్రభుత్వం ఈ ప్రభుత్వ హయాంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు భీమా ప్రీమియం బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కష్టంలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని విజ్ఞప్తి చేశారు. 175 సచివాలయం అడ్మిన్ ఎస్‌కే యూసఫ్, సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ ఉపేంద్ర పాల్గొన్నారు.

జనసేన, టిడిపి విజయం ఖాయం

45వ డివిజన్‌లో బొమ్ము రాంబాబు, గోవిందలక్ష్మి ప్రచారం

ప్రచారంలో బొమ్ము రాంబాబు దంపతులు

ప్రజాశక్తి - భవానీపురం : ఇంటింటికి రాబోయే మన జనసేన టిడిపి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 45వ డివిజన్‌లో జనసేన డివిజన్ అధ్యక్షురాలు బొమ్మ లక్ష్మీ రాంబాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు బొమ్ము రాంబాబు, బొమ్ము గోవిందలక్ష్మి మాట్లాడుతూ జనసేన, తెలుగుదేశం రానున్న ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని అన్నారు. డివిజన్‌లో చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, జగన్ పాలన దారుణంగా వుందని ప్రజలు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : కార్పొరేట్ శక్తులకు, భూ కబ్జాదారులకు అనుకూలంగా ఉండి న్యాయవాదులకు నష్టదాయకంగా మారిన రైతు, ప్రజా వ్యతిరేక భూ యాజమాన్య హక్కు చట్టం (యాక్ట్ 27 ఆఫ్ 2023)ను రద్దుచేయాలని కోరుతూ అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళ వారం తిరువూరు కోర్టు విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో ఐలు నాయకులు మేకల నాగేంద్రప్రసాద్, న్యాయ వాదులు మాకరాజు రాంమోహన రాజు, రాజవ రపు శ్రీనివాసరావు, చింతలవెంకటరెడ్డి, అత్తులూరు శ్రీనివాసరావు, మునగాల అప్పారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు కీర్తిశేషులు పొదిలి సంపతరావు సేవలు అభినందనీయమని వైసీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాసకుమార్ కొనియా డారు. మంగళవారం సంపతరావు 11వ వర్ధంతి సంధర్భంగా అయన జ్ఞాపకార్థం విద్యాధరపురం డిఎస్ఎమ్ హైస్కూల్‌లో విద్యార్ధినీ విద్యార్థులకు భోజనం వడ్డించే స్టీల్ ప్లేట్లను ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైఎస్సార్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్, స్థానిక 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవరచుకుని ఎదుటి వారికి సహాయం అందించడానికి ముందుకు రావాలని కోరారు. కార్పొరేటర్ నరేంద్ర రాఘవ, మాజీ డిప్యూటీ మేయర్ సిరిపురపు గ్రిటన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పొదిలి చంటిబాబు, వైఎస్సార్ పార్టీ నాయకులు ఇబ్రహీంపట్నం వైసిపి నాయకులు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెంలో 'పల్లెకి పోదాం'

ప్రజాశక్తి-గంపలగూడెం: మంగళవారం సాయంత్రం గంపలగూడెంలో పల్లెకు పోదాం కార్యక్రమం మండల నోడల్ ఆఫీసర్ గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. స్థానిక రెండవ సచివాలయ పరిధిలో ఉన్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాల జాబితాను సర్పంచ్ కోట పుల్లమ్మ ఆవిష్కరించారు. అనంతరం వైసిపి నాయకులు ర్యాలీగా స్థానిక గాంధీ సెంటర్‌కు వచ్చి వైసిపి పార్టీ పథకాన్ని ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు.

ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - విస్సన్నపేట : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. విసన్నపేటలో ఓటు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటుపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణ, డిటి మోతియా, రెవిన్యూ సిబ్బంది, బూత్ లెవెల్ ఆఫీసర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలియో బాధితునికి సాయం

ప్రజాశక్తి - భవానీపురం : పోలియో కారణంగా రెండు కాళ్ళు చచ్చు పడి మంచానికి పరిమితమైన వ్యక్తి కుటుంబ సభ్యులకు ,నెలవారీ సరుకులను, కొంత నగదును మానవత సేవా సంస్థ అందచేసి 'మానవత'ను చాటుకుంది. మానవ సేవే మాధవ సేవగా ఆచరిస్తున్న నెలవారీ సేవా కార్యక్రమంలో ఈ సాయం అందచేశారు. మానవత సంస్థ విజయవాడ శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవత్వంతో నిస్వార్థంగా సేవచేస్తూ, అవసరమైన వారికి సహాయ పడాలనే మంచి లక్ష్యంతో, సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియచేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి, వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను మంగళవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లిఖార్జునరావు దంపతుల వారు విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల15వ తేదీ నుండి ప్రారంభం కానున్న క్రీడలకు సంబంధించిన కిట్లను తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్ పర్సన్ గత్తం కస్తూరి బాయి కమీషన్ బాలకృష్ణతో సచివాలయ కార్యదర్శులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో.విద్యాశాఖ అధికారి చదల రామకష్ణ, వైస్ చైర్ పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

45 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్‌నిర్వహించి, ఐదో ట్రాఫిక్ పోలీస్టేషన్ పోలీసు వారు మొత్తం 45 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులను ఆరవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులలో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు ఎనిమిది మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా, మిగిలిన 37 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, పాటంచాలని సూచించారు.

గన్నవరంలో...

పామర్రులో...

కంకిపాడులో...

గుడివాడలో...

అవనిగడ్డలో...

అంగన్‌వాడీల సమ్మె బాట

హామీలు నెరవేర్చాలని కృష్ణాజిల్లాలో ఆందోళనలు

ఎన్నికలకు ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టారు. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం కలెక్టరేట్‌తో పాటు వివిధ మండలాల్లో అంగన్‌వాడీలు మంగళవారం సమ్మెలో పాల్గొన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడంలేదన్నారు. అన్ని రకాల ధరలు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం కష్టతరంగా ఉందన్నారు. అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తెలంగాణా కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన సిఎం హామీ నెరవేరలేదన్నారు. ప్రభుత్వం అందరికీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయడంలేదన్నారు. అంగన్‌వాడీలకు సిఐటియు జిల్లా నాయకులు బూర సుబ్రమణ్యం, ఎం.పోలినాయుడు, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యూనస్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ప్రాజెక్టు ఆధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ నాంచారమ్మ, పి.రెజీనా రాణి, లక్ష్మి, అంజలి, విజయశ్రీ, సీతారత్నం, రత్నకుమారి, సుజాత, సౌజన్య, స్వర్ణలత పాల్గొన్నారు. **గన్నవరం:** పని భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని అందువల్ల అంగన్వాడీలు పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ అంగన్వాడీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆచరణలో చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, నాయకులు బేతా శ్రీనివాసరావు, ఎం ఆంజనేయులు పాల్గొన్నారు. **కంకిపాడు:** కంకిపాడులో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. **ఈ** కార్యక్రమంలో కంకిపాడు ప్రాజెక్టు లీడర్స్ వై.నళినికుమారి, ఎం.రేవతి, పి.రమాదేవి, సిహెచ్.విజయలక్ష్మి, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి:** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు బంటుమిల్లి మండల కార్యదర్శి మాజేటి శివశ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి అజయ్ ఘోష్, జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు గోపిలక్ష్మి, నాగేంద్ర కుమారి, శ్రీదేవి, విఠలేశ్వరి, గ్రేస్ గీత, పార్వతి, కమల పాల్గొన్నారు **గుడివాడ రూరల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం దారుణమని సిపిఎం గుడివాడ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. టిడిపి గుడివాడ నియోజకవర్గ బాధ్యుడు వెనిగండ్ల రాము ధర్నాకు మద్దతు తెలిపారు. **అవనిగడ్డ:** అవనిగడ్డలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.రఘు, రాష్ట్ర మత్స్యకారుల సంఘం నాయకులు కొల్లాటి శ్రీనివాసరావు, శీలం నారాయణరావు, కౌలు రైతుల సంఘం నాయకులు బండి ఆదిశేషు, కొపనాతి తాతయ్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి, నాగమణి, గాదే సుశీల, ఎం కాశీ, హంస, ఎం రాణి, కె పాములమ్మ, విజయరాణి, సువర్ణకుమారి పాల్గొన్నారు. **పామర్రు:** పామర్రు అంగన్వాడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి ఓ గంగాధర్, కె.ఉమారాణి, రత్నశ్రీ, పద్మజ, వాణి, జ్యోతి, సువర్ణ లత, సిఐటియు మండల అధ్యక్షులు ఐ.రాజు, కౌలు రైతు సంఘం నాయకులు కె. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-గుడివాడ: ఓటు హక్కు చాలా విలువైనదని, భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకుని దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని గుడివాడ మున్సిపల్ కమీషనర్ వడ్లాది మురళీకృష్ణ అన్నారు. మంగళవారం గుడివాడ మున్సిపల్ పరిధిలోని 36వ వార్డు నీలామహాల్ రోడ్డులోని అల్లం బడి వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రంలో లో ఓటు వేసే విధానాన్ని స్వయంగా డెమో ద్వారా సందర్శకులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కలిగించేందుకు కలెక్టరేట్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ప్రదర్శన కేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శనలో తప్పనిసరిగా పాల్గొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, ఓటు వేసే విధానం తెలుసుకుని నమ్మకాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఓటు వేసే విధానంపై ప్రజలకు ఏ విధమైన సందేహాలు ఉన్నా సరే అవగాహన కేంద్రం వద్ద ఉన్న ఎన్నికల నమోదు అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ గుడివాడ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుడివాడ : ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల నూతన కమిటీ ఎన్నికైంది. గుడివాడ మండలం మహాసభ స్థానిక సుందరయ్య భవన్లో మంగళవారం నిర్వహించారు. ఈ మహాసభలో విద్యారంగ సమస్యల మీద చర్చించి అనంతరం

నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా జి.పవన్, కార్యదర్శులుగా సమీర్, సహాయ కార్యదర్శిలుగా ఎం.రఘు, ఎ.డానియల్, కే రేవంత్, ఉపాధ్యక్షులుగా జోగిబాబు, జి అవినాష్, ఎన్.అశోక్, బి. రాహుల్, మండల కమిటీ సభ్యులు కే. సురేష్ బాబు, హరి గణేష్, ఏ.ఇశ్రాయేలు, టి.రవి, టి.లక్ష్మణ్ ఎన్నికయ్యారు. గుడివాడ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, పెండింగ్లో ఉన్న అమ్మఒడి, విద్యా దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని చేసిన తీర్మానాలకు నూతన కమిటీ ఆమోదం తెలిపిది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కష్ణాజిల్లా కార్యదర్శి ఎస్.సమరం, సహాయ కార్యదర్శి సిహెచ్ రాజేష్, సహాయ ఉపాధ్యక్షులు ప్రేమ్ పాల్గొన్నారు.

అక్షరాస్యతపై కళాజాత

ప్రజశక్తి-గుడివాడ (నందివాడ) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో చైర్మన్, సీఈఓ ఆదేశానుసారంగా నాబార్డ్ వారి సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం కళాజాత బృందం వై వీరయ్య, రవితేజ కళాజాత సభ్యులచే నిర్వహించడం జరిగింది. ఈ కళాజాత కార్యక్రమం మంగళవారం నందివాడ మండలంలోని అరిపిరాల, వెంకట రాఘవాపురం గ్రామాలలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, ప్రతి ఒక్కరు కూడా పొదుపు ఖాతా తెరవాలని, పొదుపు ఖాతా కలిగి ఉండడం వలన అనేక లాభాలు పొందవచ్చని తెలియజేశారు, అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన,

అరిపిరాలలో అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న బృందం

అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు ఏటీఎం రూపే డెబిట్ కార్డ్‌ల వాడకం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై కళాజాత బందం ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ సత్యశ్రీనివాసరావు సొసైటీ ప్రెసిడెంట్, సెక్రటరీ పాల్గొన్నారు.

నందివాడకు సరోజిని మృతదేహం

ప్రజాశక్తి-గుడివాడ(నందివాడ) : నందివాడ మండలం వెన్ననపూడి గ్రామానికి చెందిన బేబీ సరోజిని గత కొంతకాలంగా మస్కట్లో ఉద్యోగం చేస్తుంది. అనివార్య కారణాల వల్ల మస్కట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని భారతదేశానికి తరలించడానికి టిడిపి గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జ్ వెనిగండ్ల రాముని కోరారు. వెంటనే స్పందించిన వెనిగండ్ల రాము టిడిపి సెంటర్ కార్యాలయం ఎన్నారై సెల్ కోఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్ సహాయంతో టిడిపి మస్కట్ నాయకుడు మహమ్మద్ ఇమామ్, ప్రముఖ సోషల్ యాక్టివిస్ట్ రాజ్యలక్ష్మిల సహాయంతో బేబీ సరోజిని మృతదేహాన్ని భారతదేశానికి ఆ తర్వాత వెన్ననపూడి గ్రామానికి తరలించారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి: నడకుదురు గ్రామ దేవాలయంలో అర్చకులుగా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన కంఠంరాజు వెంకటేశ్వరరావు మట్టి ఖర్చులకు దేవాలయ శాఖ ఈవో యార్లగడ్డ వాసు అందించిన పది వేల రూపాయల సాయాన్ని గ్రామ సర్పంచ్ గొరిపర్తి సురేష్‌బాబు కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో సజ్జా బలరాం, త్రివిక్రమరావు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం

ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో గన్నవరం సెయింట్ జాన్స్ స్కూల్ కి చెందిన నాగ ప్రియుష అండర్ 17 విభాగంలో సిల్వర్ మెడల్, జెన్నీ ప్రజక్త అండర్ 14 విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారని స్కూలు ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ నాగరాజు తెలిపారు.

మంచినీటి సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి-గూడూరు: కలపటం గ్రామంలో మంగళవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వెంకటరమణ పర్యటించారు. కలపటం గ్రామంలో ప్రస్తుతం ఉన్న వాటర్ సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వాటర్ పంపు లైన్ ఇవ్వటానికి మంచి నీటి చెరువును, మైక్రో ఫిల్టర్, సంపు ఏర్పాటుకు భూమిని పరిశీలించారు. జలజీవన్ మిషన్ ద్వారా త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వేముల సురేష్ రంగబాబు, సర్పంచ్‌లు ఐనాలా శ్రీనివాసరావు, కోడె వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

18 వరకు పంటల నమోదు

ప్రజాశక్తి-గన్నవరం: తుపాన్ వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి ఎన్ఎల్ తేజశ్వి మంగళవారం చెప్పారు. హెక్టారుకు రూ.17వేలు పరిహారంగా అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనికి రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పొలం పాస్ పుస్తకం, ఈ క్రాప్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం జిరాక్స్ కాపీలు అందజేయాల్సి ఉందన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న పంటలకు మాత్రమే నష్టపరిహారం వర్తిస్తుందని చెప్పారు. మండలంలో వరి, వేరుశనగ, పత్తి పంటలకు నష్టపరిహారం అందుతుందన్నారు. ఈ నెల 18వ తేదీ వరకూ నష్టపోయిన పంటలను నమోదు చేస్తామని, 22వ తేదీ వరకూ సోషల్ ఆడిట్ ద్వారా ఆర్బీకేలలో జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. 26వ తేదీన ఫైనల్ లిస్టును కలెక్టర్‌కు పంపుతామన్నారు.

విద్యార్థులకు మోడల్ టెన్త్ పేపర్లు పంపిణీ చేస్తున్న నేతలు

ఉచితంగా యుటిఎఫ్ టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి - తోట్లవల్లూరు : యుటిఎఫ్ ప్రచురించిన టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్లను మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ గన్నే వెంకట్రావు మాట్లాడతూ యుటిఎఫ్ వారు ప్రతి సంవత్సరం ప్రచురిస్తున్న మోడల్ టెస్ట్ పేపర్లు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు. వీటిని విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాక్షించారు. దాత చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో చక్కగా స్థిరపడాలని, దానికి మార్గం చదువు మాత్రమేనని అన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకోవాలని, పరీక్షల భయం పోగొట్టుకోవాలని అన్నారు. అనంతరం. విద్యార్థులందరికీ యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కో ఆపరేటివ్ సొసైటీ పూర్వ అధ్యక్షులు రాము, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాపారావు, వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, ఎస్.పి మనోహర్ కుమార్, అహ్మద్‌బాబు, సత్యవంతు, పీటర్సన్, అనూష, శ్రీలక్ష్మి, కోటయ్య, ఉజ్వల, జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్‌పేటలోని విజయవాడ నగర పాలక సంస్థ వెహికల్ డిపోను మంగళవారం విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంధనాన్ని దుర్వినియోగం చేసిన వాహన డ్రైవర్లు బొల్లా సూర్య ప్రకాష్, మిందల జమల కేశవను విధుల్లో నుండి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా పోలీసు కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకా పూర్తి విచారణకు అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ కె.సత్యవతిని ఆదేశించినట్లు తెలిపారు.

టిడిపి నేతల ఫీట్లు

(మొదటి పేజీ తరువాయి)

టిడిపి, జనసేన పొత్తు నేపథ్యంలో ఈ సీటును ఎవరికి కేటాయిస్తారనే దానిపైనా ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఆశావహులు నిర్వహిస్తున్న పోటాపోటీ సమావేశాలతో పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. ఇటువంటి పరిణామాలు గెలుపు అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాయి. ఈ గందరగోళ పరిస్థితికి అధిష్టానం స్వస్తి పలకాలని కోరుతున్నాయి. దీనిపై త్వరలో పార్టీ హైకమాండ్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని టిడిపి శ్రేణులు భావిస్తున్నాయి. జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పోతిన వెంకట మహష్ కూడా పశ్చిమ సీటుపై కన్నేసి ఏడాది కాలంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. టిడిపి, జనసేన పొత్తులో భాగంగా ఈ సీటును తమకు కేటాయిస్తారని జనసేన శ్రేణులు భావిస్తున్నాయి. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో ముస్లింలు, ఆర్యవైశ్యలు, నగరాలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఈ మూడు సమాజిక వర్గాల ఓటర్లను ఆకర్షించేందుకు టిడిపి, జనసేన, వైసిపి పోటీ పడుతున్నాయి. 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకున్న టిడిపి తరపున మాజీ ఎంఎల్ఎ జలీల్ ఖాన్, మాజీ ఎంఎల్‌సి బుద్దా వెంకన్న, మాజీ మంత్రి ఎంకే బేగ్ కుమారుడు ఎంఎస్ బేగ్ ఇంటింటికీ తిరుగుతున్నారు.

కిడ్నీవ్యాధి నివారణకు రక్షిత మంచినీరు అందించాలి

ప్రజారోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ ప్రకాష్ డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కిడ్నీవ్యాధి ఎక్కువగా ఉన్న ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండల ప్రజలకు కృష్ణానది నుండి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ప్రజారోగ్య వేదిక ఎన్‌టిఆర్ జిల్లా నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజారోగ్య వేదిక బృందం ఏ.కొండూరు మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్, కార్య నిర్వాహక కార్యదర్శి సంతోష్, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఎ.కొండూరులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కిడ్నీవ్యాధి బాధితుల పరిస్థితి గురించి వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా జి.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ గత ఐదున్నరేళ్లుగా ఎ.కొండూరు మండలంలో కిడ్నీవ్యాధి సమస్యపై ప్రజారోగ్య వేదిక, ప్రజా సంఘాలు, ప్రజలు చేస్తున్న పోరాటం ఫలితంగా ప్రభుత్వం స్పందించి డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈమండలంలోని అన్ని గ్రామాలకు శాశ్వ త ప్రాతిపదికన కృష్ణానది నుండి రక్షిత మంచినీటిని అందించాలని కోరారు. అప్పుడు మాత్రమే ఫ్లోరైడ్, సిలికా ప్రభావం నుండి ప్రజలను కాపా డ గలుగుతామని అన్నారు. ప్రభుత్వం కొన్ని గ్రామాలకు మాత్రమే ట్యాం కర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తోం దని, మిగిలిని అన్ని గ్రామాలకు మంచినీటి సరఫ´రాను విస్తరిం చాలని కోరారు. ప్రస్తుతం టాంకర్ల ద్వారా వస్తున్న మంచినీటిని పరిశీలిస్తే టిడిఎస్ మోతాదుకు మించి 300 వరకూ ఉందన్నారు. అందువల్ల టిడిఎస్‌ను మోతాదును పరిశీలించి వెం టనే అరిక ట్టాలని కోరారు. కిడ్నీ వ్యా ధి బాధితు లకు అవస రమైన అన్ని రకాల మందు లను ప్రభుత్వం అందించాలని కోరారు. బాధితులు డయాలసిస్ వరకు రాక మునుపే వ్యాధిని అరికట్టేందుకుగాను వారానికొకరోజు ఎ.కొండూరు పిహెచ్‌సిలో మూత్ర పిండాల వ్యాధి నిపుణుడితో కిడ్నీ పేషెంట్లకు ఒపి సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎ.కొండూరులోని డయాలసిస్ కేంద్రంలో రోగులను పరామర్శిస్తున్న విజయప్రకాష్ తదితరులు

'ఆడుదాం ఆంధ్రా'లో సమన్వయం అవసరం : జెసి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు.

IN THE COURT OF THE Ist Addl. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
E.P No. 40/2022
in O.S No. 804/2008
Between :-
Katuri Bharathi .... DHR
AND
Badrinarayana Tapadiya
.......JDR
To,
JDR:
బద్రి నారాయణ తపాడియా, తండ్రి ఘన్ శ్యామ్ దాస్ తపాడియా షాపు నెం: 4 మరియు 5, రాజపుతానా జ్యూవెలరీ, ఎ.యమ్.సి కాంప్లెక్స్, రాజ గోపాలచారివీధి, గవర్నరుపేట, విజయవాడ-2.
పై నెంబరు ఇ.పిలో జె.డి.ఆర్ అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా తిప్పిపంపిన కారణంగా కోర్టువారు ఈ న్యూస్ పేపరు ద్వారా తెలియజేయ వలసినదిగా ది.20.12.2023న కు వాయిదా వేసినారు. . సదరు వాయిదా రోజున ఉదయం 10.30లకు మీరు స్వయంగాని, మీ వకీలు ద్వారాగాని పై కోర్టులో హాజరై తమకు గల అభ్యంతరాలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా తీర్మానం చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడ మైనది.
శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
ఇట్లు : నర్రా నాగేశ్వరరావు, న్యాయవాది.
పటమట, విజయవాడ-10
Vijayawada,
Dt: 12-12-2023.

IN THE HOUNOURABLE COURT OF THE XIIITH ADDITIONAL DISTRICT JUDGE AT GAJUWAKA
MVOP No. 741 / 2019
Between:
Kolamganti Triveni . . . Petitioner
And:
Govathoti Suresh etc
. . . Respondents
To:
2nd Respondent:
Lalitha Chidepudi,
W/o. Ramakrishna
(Owner of Lorry bearing AP16TB 5949, D.No. 70-10-6/2, Santhi Nagar, Patmata, Vijayawada, Krishna District, A.P.
నోటీసు
పై నెంబరు పిటిషనులో కోరిన ప్రకారం డిక్రీ యిప్పించకోరి పిటీషనరు, రెస్పాండెంట్లుపై పైనెంబరు పిటిషను దాఖలు చేసిరి, సదరు పిటిషనులో 2వ రెస్పాండెంటుకు నోటీసు కొరకు **తే:27-12-2023దీకి** వాయిదా కలదు. కావున ఏమయిన ఆక్షేపణలున్నచో పై కోర్టులో **తే:27-12-2023దీ ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మాణించడ మగునని యిందుమూలంగా తెలుపడమైనది.
REDNAM DURGA PRASAD
Advocate for D.Hr.
Anakapalle.
Anakapalle
Dt. 12-12-2023
Cell : 9849506151

IN THE COURT OF THE 1st ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.NO.266/2022 IN O.S.NO1025/2022
బిట్వీన్:
కాసాని సత్యకుమారి,
సుంకేసుల ఆదిలక్ష్మి .... పిటీషనర్స్ / వాదులు
మరియు
రేగళ్ళ బుల్లయ్య, రేగళ్ళ శ్రీనివాసరావు,
రేగళ్ళ సాంబశివరావు ... రెస్పాండెంట్స్ / ప్రతివాదలు టు,
రేగళ్ళ సాంబశివరావు, తండ్రి. (లేటు) కోటయ్య, నివాసం: కాజీపేట, గుంటుపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణాజిల్లా.
పై నెంబరు పిటిషన్‌లో మీరు 3వ రెస్పాండెంట్ అయివున్నారు. మీ హాజరు నిమిత్తము వాయిదా తేది. 29-12-2023 అయివున్నది. ఆ రోజన మీరు పైన తెలిపిన కోర్టు వారి సమక్షములో ఉదయం గం.10.30 ని.లకు స్వయంగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు కాని పక్షమున పై పిటీషన్‌ను శ్రీ కోర్టువారు మీ పరోక్షముగా తీర్మానించెదరు.
/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///
వాయిదా తేది: 29-12-2023
టి.సి.కొలంబస్
విజయవాడ పిటిషనర్స్ తరపు న్యాయవాది
ది.12-12-2023 విజయవాడ

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VIZIANAGARAM
I.A.543/2022 in F.D.I.A. 764/2018 in O.S.467/2012
Between:
Gurajada Madhusudana Rao
...Petitioner/2nd Defendant
And
Gurajada Venkata Lakshmi & 2 others ...Respondents/Plaintiffs
Gurajada Meenakshi & 3 others
...Respondents/Defendants 1,3 to 5
NOTICE
To,
R-6: Smt. Devu Pankaja Valli,
W/o. Brahmaji, D.No.9-244, Balaramunipeta, Machilipatnam, Krishna District.
Please take notice that the above-named petitioner/2nd defendant filed the above I.A. against Respondents to set aside the ex parte order against him in the above F.D.I.A. and the said I.A. stands posted to **28-12-2023** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-12-2023 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
P. V. RAJAGOPAL, Advocate,
Visakhapatnam. **Cell: 98482 65456.**

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE CUM ASSISTANT SESSIONS JUDGE AT KOTHAGUDEM
H.M.O.P.No.98 of 2023
Between:
Seelam Mahidhar Kumar ...Petitioner
Vs
Bhimala Nagamani @ Seelam Nagamani
...Respondent
పై కేసులో ప్రతివాది అయిన భీమాల నాగమణి W/o.శీలం మహిధర్ కుమార్, D/o.భీమాల వెంకటేశ్వరరావు, వృత్తి: విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ కుమ్మరికుంట గ్రామం, నివాసం: కంభంపాడు గ్రామం, ఎ.కొండూరు మండలం, NTR జిల్లా గారి హాజరు నిమిత్తం ది.08-01-2024 వ తేదిన వాయిదా కలదు. ఆ రోజు ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టులో పిలిచినప్పుడు మీరు స్వయంగా కాని లాయరు గారి ద్వారా కాని హాజరు కాగలరు. లేని యెడల పై కేసులో మీ యొక్క పరోక్షములో కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడ మైనది.
కోర్టు వారి ఉత్తర్వులననుసరించి
sd/- SK.Abdul Basha,
Advocate,
Kothagudem,
Bhadradri-Kothagudem District.

ప్రకటన
7వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, విజయవాడ
ఐ.ఎ.నెం.585/2023
మరియు
ఐ.ఎ.నెం.586/2023 ఇన్ ఓ.యస్.నెం. 139/2023
బిట్వీన్:
చెరుకూరి ఆనందరావు ...పిటిషనర్/వాది
మరియు
1.కారుమూరి గీతాదేవి
2.యడ్లపల్లి శైలజ
3.తహశీల్దార్, విజయవాడ రూరల్
4.సబ్ కలెక్టరు, విజయవాడ
5.జిలా కలెక్టరు, కృష్ణా ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
పై తెలిపిన దావాలోని పై తెలిపిన ఇంటెరిమ్ పిటిషన్లు సంబంధించి పై తెలిపిన 2వ రెస్పాండెంటు/2వ ప్రతివాది సదరు పై తెలిపిన కోర్టువారు పంపిన నోటీసులు కావాలని అందుకొనక కాలయాపన చేయుట కారణంగా ది.19-10-2023 న సదరు కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియ జేయుటకు గాను ఉత్తర్వులు ఇచ్చిన ప్రకారము ఇందులోని 2వ రెస్పాండెంటు/2వ ప్రతివాది అయిన యడ్లపల్లి శైలజ భర్త శివరామ ప్రసాద్, హిందూ, వయస్సు షుమారు 58 సం॥లు, HIG-210, హౌసింగ్ బోర్డు కాలనీ, భవానిపురం వాస్తవ్యులు, తాను వ్యక్తిగతంగా గాని, తన వకీలు ద్వారా గాని పై తెలిపిన కేసులో ది. 21-12-2023న పైకోర్టు నందు ఉదయం 10-30 ని॥లకు హాజరై, తమ వాదనలు కొనసాగించ వలయునని, అట్లు హాజరు కానియడల వారిని ఎక్సెపార్టీగా భావించి, తదుపరి విచారణ కొనసాగించ గలరని యిందు మూలముగా తెలియపరచడమైనది.
కొత్తూరు తాడేపల్లి గ్రామము,
విజయవాడ రూరల్ మండలం,
యన్.టి.ఆర్.జిల్లా.
తేది:12-12-2023
ఇట్లు
కొమ్మినేని భావనారాయణ,
తాడిబోయిన శ్రీనివాసరావు,
న్యాయవాదులు,
సెల్ నెం.9441014403

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు

ఎన్‌టిఆర్ జిల్లా.
Rc.No.A1/29/2022 Dt. 12-12-2023
షార్టు టెండరు - కం- బహిరంగ వేలము ప్రకటన

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు, యన్‌టిఆర్‌జిల్లా నందు ఈ దిగువ తెలియపరచిన ఐటములకు ది. 20-12-2023న ఉదయం 11-00 గం.లకు దేవాలయ బేడా మండపము నందు బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.నెం.	వివరము	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము రూ.
1.	మున్నేరు ఆవల పాపమంబ వనం, ఆడిటోరియం మరియు దేవస్థానం సత్రం నందలి మామిడిచెట్టు సుమారు 150 ఉన్నవి ఉన్నట్లుగా సంరక్షించుకొని, ఫలసాయాన్ని పొందుట.	అప్పగించిన తేది నుండి ది.30-06-2024 వరకు	10,000/-
2.	శ్రీ అమ్మవారి దేవస్థానము మెయిన్ స్టోర్స్ నందు ఖాళీగా ఉన్న నెయ్యి/నూనె డబ్బాలు ఉన్నవి ఉన్నట్లుగా తీసుకొని పోవుట.	టెండర్/వేలం ఖరారు అయిన తేది నుండి ది.31-3-2024 వరకు	5,000/-
3.	సులభా కాంప్లెక్స్ తొలగించగా వచ్చిన పాత ఇనుము, ఇనుప సామాగ్రి మరియు వంట చెరకుకు ఉపయోగపడు కలప ఉన్నది ఉన్నట్లుగా తీసుకొని పోవుట.	7 రోజులలో ఖాళీ చేయవలెను	5,000/-
4.	దేవస్థానం ప్రాంగణంలో దేవస్థానము వారు సూచించిన ప్రదేశములో గాలితో నింపిన జారుడు బల్ల ఏర్పాటు (చిన్న పిల్లలకు మాత్రమే)	01-01-2024 నుండి ది.31-3-2024 వరకు (3 నెలలు)	10,000/-
5.	దేవస్థానం ప్రాంగణంలో దేవస్థానము వారు సూచించిన ప్రదేశములో శ్రీ అమ్మవారి దీక్షా మాలదారణకు సంబంధించి వస్తువులు వస్త్రములు మాలలు మరియు తదితరములు విక్రయించుకొనుటకు తాత్కాలిక షాపులు ఏర్పాటు (6 షాపులు)	ది.06-01-2024 నుండి ది.15-01-2024 (10 రోజులు)	5,000/-

షరతులు :
1) పైన తెలిపిన బహిరంగ వేలం పాటలు G.O.M.S. No. 425 నందలి నిబంధనల ప్రకారం మరియు దేవాదాయ ధర్మాదాయ చట్టం అనుసరించి 30/87 లోని అందు నిబంధనలను అనుసరించి శ్రీయుత కమీషనర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ, గొల్లపూడి, విజయవాడ వారి ఆమోదపు ఉత్తర్వులకు లోబడి నిర్వహించబడును.
2) బహిరంగ వేలములో పాల్గొనువారు తమకు సంబంధించిన ఆధార్‌కార్డు తప్పని సరిగా ఒరిజినల్ మరియు జిరాక్సు కాపీలతో పాటకు హాజరు కావలెను.
3) పాటదారులు ధరావత్తు సొమ్మును కార్యనిర్వహణాధికారి, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు వారు పేరున డి.డి.రూపములో మాత్రమే చెల్లించవలెను. నగదు స్వీకరించబడదు.
4) హెచ్చుపాటదారుడు పాట ముగిసిన వెంటనే G.O.M.S. No. 425 ప్రకారం హెచ్చుపాట మొత్తం ముందస్తుగా బ్యాంకు ద్వారా చెల్లించవలెను. నగదు స్వీకరించబడదు. అట్లు చెల్లించని యెడల ఎటువంటి నోటీసు లేకుండా ధరావత్తు సొమ్మును దేవస్థానం నిధులకు జమచేసి తిరిగి బహిరంగ వేలము నిర్వహించబడును.
5) వ.నెం.1,2 మరియు 3లకు ముందుగా చూసుకొని, ది. 20-12-2023 బహిరంగ వేలము నందు పాల్గొనవలెను. పై వారికి సంబంధించి టెండరు షెడ్యూల్ జారీ తేది 14-12-2023 నుండి ది.19-12-2023 వరకు, టెండరు దాఖలు తేది 20-12-2023 ఉదయం 11-00 గం.ల వరకు, బహిరంగ వేలము ముగిసిన తదుపరి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండరుబాక్సు తెరువబడును.
7) మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

కె.రమేష్‌నాయుడు,
డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి.

ధాన్యం రైతు దైన్యం



రోడ్డుపై బస్తాల్లో ఉన్న ధాన్యం



- తడిసిన పంటను ఆరబెట్టేందుకు అవస్థలు
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- ఆర్‌బికెల్లో మందకొడిగా కొనుగోళ్లు

ప్రజాశక్తి-గన్నవరం: ధాన్యం బస్తాలు నేటికీ రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. వాటిని కొనుగోలు చేసేందుకు ఆర్‌బికె సెంటర్లలో తాత్సారం జరుగుతోంది. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. నిబంధనలు సడలించి ధాన్యం కొంటున్నామన్న మాట ఆచరణలో అమలు కావడంలేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగొళ్లకు ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందో అర్థం కాక రైతాంగం తలలు పట్టుకుంటుంది. పంట సాగులో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని కష్టించి పంటలు పండించిన రైతులకు ప్రకృతి వైపరీత్యాలు కన్నీటినే మిగుల్చుతున్నాయి. ఇటీవల తుపాను ప్రభావంతో ఖరీఫ్ సాగు చేసిన వరి నేలకొరిగి, పసలపై, ధాన్యం రాశులు ఇలా అనేక రకాలుగా దెబ్బతిందని సన్న, చిన్నకారు, కౌలురైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖరీఫ్ వరి కోతలు ప్రారంభానికి ముందే మండలంలోని 24 సచివాలయాల పరిధిలోని 18 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 25,450 ఎకరాల్లో వరి సాగైంది. ఈ సాగు ద్వారా 74 వేల టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారుల అంచనా. ఖరీఫ్ వరి కోతలు ప్రారంభ దశలో ఉండగానే తుపాను ముంచుకొచ్చి రైతన్న నడ్డి విరిచింది. తుపానుకు ముందు పది రైతు భరోసా కేంద్రాల ద్వారా 3,422 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. తుపాన్‌కు ముందు యంత్రాలతో కోసిన ధాన్యం తేమ శాతంలో సడలింపు ఇస్తూ ధాన్యం తక్షణమే రైస్ మిల్లులకు తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా ఎక్కడా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ధరపై స్పష్టత కరువైంది. దీంతో రైతాంగం వర్షానికి నిండా మునిగి పీకలోతు కష్టాల్లో కూరుకుపోయింది. వర్షాలతో తడిసిన ధాన్యం ఆరబెట్టడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేసిన రైతులకు తడిసి ధాన్యం ఆరబెట్టి మిల్లులకు తరలించాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుందని వాపోతున్నారు. ఏదో విధంగా ధాన్యం ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలిద్దామంటే మండలంలో ధాన్యం కొనుగోళు మందకొడిగా సాగుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు చెప్పినంతగా క్షేత్రసాయిలో పరిస్థితులు లేవని, ధాన్యం విక్రయించాలంటే రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. పురుషోత్తపట్నం, హనుమాన్ జంక్షన్, ప్రసాదంపాడు రైస్ మిల్లులకు రైతులు తమ ధాన్యం తరలించాల్సి ఉంది. కానీ తుపాన్‌కు ముందు నామమాత్రంగా జరిగిన కొనుగోళ్లు ఆ తరువాత జరగకపోవడంతో సన్న, చిన్నకారు, కౌలు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యమంతా సంచుల్లోకి ఎత్తడానికి సంచులు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. అష్టకష్టాలు పడి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. తేమ శాతంతో రైతులను ఇబ్బంది పెట్టకుండా ఆర్బికే సెంటర్లు యుద్ధ ప్రాతిపదికన ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టాలని అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కోరుతున్నారు.

ఉయ్యూరులో అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

పంటల నష్టాన్ని నమోదు చేయండి

ప్రజాశక్తి-ఉయ్యూరు: తుపాన్ ప్రభావంతో నష్టపోయిన కౌలు రైతులను గుర్తించి నష్టపరిహారం నమోదు చేయాలని మంగళవారం ఉయ్యూరు ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు అన్నే సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలను సడలించి తుపానుకు నష్టపోయిన ప్రతీ పంటను నమోదు చేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు రంగారావు, కోటేశ్వరరావు, చింతయ్య, సిఐటియు నాయకులు బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు. తుపాను వల్ల నీటమునిగి పంట పొలాలను టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బోడెప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఆకునూరు, కడవకొల్లు, కాటూరు

గ్రామాల్లో నాయకులు పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, రామకృష్ణ, వీరబాబు,కొనకళ్ల బుల్లయ్య, కుటుంబరావు, కాకాని శ్రీనివాసరావు, దండమూడి చౌదరి, అనుమోలు ప్రభాకరరావు పాల్గొన్నారు. **గన్నవరం:** వర్షాల వల్ల తడిసి మొలకెత్తుతున్న వరి పొలాలను తెంపల్లి గ్రామంలో సర్పంచ్ కొలుసు శిరీష మంగళవారం పరిశీలించారు. రోజుల తరబడి నీరు నిలవ ఉండటంతో ధాన్యం మొలకెత్తిందని రైతులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో కొలుసు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డ చల్లపల్లికి చెందిన సిటీ కేబుల్ రిపోర్టర్ కల్లేపల్లి చంద్ర కుటుంబానికి అవనిగడ్డకు చెందిన ఎస్వీఎల్ క్రాంతి విద్యాసంస్థల విద్యార్థులు, యాజమాన్యంతో కలిసి రూ.27 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు అవనిగడ్డ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు టీవీ సారంగపాణి అయ్యంగార్‌కు నగదు అందజేశారు.

డిఎస్‌సి అభ్యర్థుల ధర్నా

ప్రజాశక్తి-అవనిగడ్డ: రాష్ట్ర ముఖ్యమంత్రి డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని అవనిగడ్డలో డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు మంగళవారం అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డీఎస్సీ అభ్యర్థులు ఒక్కసారిగా వేలాదిగా తాసిల్దార్ కార్యాలయానికి తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే మెగా డీఎస్సీ ప్రకటిస్తానని హామీ ఇచ్చి నేటికి నాలుగున్నర సంవత్సరాలు దాటుతున్నప్పటికీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని దుయ్యబట్టారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఏ విధంగా నిరుద్యోగులుకున్న పాఠం చెప్పారో 2024 ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అభ్యర్థులకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మతి వెంకటేశ్వరరావు, గుడివాడ శేషుబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

అనంతరం గాంధీ క్షేత్రంలో నిరుద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశంలో వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకుండా కొత్త ఉపాధ్యాయులను రానివ్వకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా జగన్ మోసం చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఎవరైనా సమస్యల మీద రోడ్డుపైకి వచ్చి మాట్లాడితే అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని విమర్శించారు. కేబినెట్ సమావేశంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ గురించి చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉయ్యూరు డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఉయ్యూరు: అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎపి పీటీడీ నేషనల్ మజూర్ యూనిటి అసోసియేషన్ మూడు రోజుల పాటు తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం ఉయ్యూరు ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డ్రైవర్, కండక్టర్, గ్యారేజిలో ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలని, 2017 పేస్కేల్ బకాయిలు ఉద్యోగులం దరికి చెల్లింపులుచేసి తద్వారా ఈపీఎఫ్-95 ద్వారా అందరికి హయ్యర్ పెన్షన్ పొందే అవకాశం కల్పించాలని యూనిట్ అసోసియేషన్ జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదాయం రాని షెడ్యూల్స్ పై పర్యవేక్షణ చేసి రీషెడ్యూల్ చేసి పునరుద్ధరించి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. డిపో కమిటీ చైర్మన్ రజనీకాంత్, వైస్చర్మన్ పిచ్చయ్య, సెక్రటరీ పిఎం కృష్ణ, షఫీ, శివప్రసాద్, టీఎర్రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక తపాల కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ హోదా వెంటనే ఇవ్వాలని, ఎనిమిది గంటల పని భారం కల్పించాలని, అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఐదు లక్షల పెంచాలని, 180 రోజుల వరకు సెలవులు దాచుకొని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని, కుటుంబ సభ్యులతో సహా వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, విజయ్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు. **గుడివాడ :** ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఎఐజిడిఎస్‌యు), నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ (ఎన్‌యుజిడిఎస్) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సిపి రెడ్డి మద్దతు తెలిపారు. గుడివాడ పోస్టాఫీసు ముందు నిరవధిక సమ్మెను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడతూ ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ 5లక్షలకు పెంచాలని, గ్రాట్యుటీ 5లక్షలకు పెంచాలని, వారి కుటుంబ సభ్యులకు వైద్యసౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రేపాని కొండ, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో...

గుడివాడలో...

పేర్ని ఆటలు సాగవు : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం నియోజకవర్గ ఓటర్లు తమ ఓటు పదిలంగా ఉందో లేక పేర్ని నాని తీసేయించాడో ఒక్కసారి సరి చూసుకోవాలని టిడిపి నగర కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి పేర్నినాని టిడిపి నేతలపై చేసిన ఆరోపణలు ఖండిస్తూ మచిలీపట్నం టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాజీ మునిసిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, పట్టణ అధ్యక్షులు ఇలియాస్ పాషా, కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ పేర్ని నానికి చిత్తశుద్ధి ఉంటే సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు అధికారులకు అడ్డుపడకుండా స్వేచ్ఛ నివ్వాలన్నారు. టిడిపి నేతల ఓట్లు తొలగింపునకు పేర్ని నాని చూస్తున్నారని, ఆయన ఆటలు సాగనివ్వమని అన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేమా సురేష్ బాబు

చిలకలూరిపేట వైసిపి ఇన్చార్జి రాజేష్‌కు వేమా అభినందనలు

ప్రజాశక్తి - కంచికచర్ల : చిలకలూరిపేట వైసిపి ఇన్చార్జిగా నియమితులైన మల్లెల రాజేష్ నాయుడును కంచికచర్ల పట్టణ వైసిపి అధ్యక్షుడు, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేష్ నాయుడు కంచికచర్లకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వేమా పేరయ్య నాయుడుకు అల్లుడు, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబుకు స్వయాన బావ. రాజేష్ నాయుడును వైసిపి అధిష్టానం చిలకలూరిపేట ఇన్చార్జిగా నియమించిన విషయం తెలిసిందే. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో చిలకలూరిపేట వైసిపి అభ్యర్థిగా రాజేష్ పోటీకి చేసే అవకాశం ఉంది. మంగళవారం వేమా సురేష్ చిలకలూరిపేటలో మల్లెల రాజేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు .

ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ అనే సంస్థ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించింది. మొత్తం 195 మంది విద్యార్థులు హాజరవ్వగా మొదటి రౌండ్ రిటన్ టెస్ట్, రెండవ రౌండ్ జస్ట్ ఎ మినిట్, మూడో రౌండ్ స్టూడెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్, నాలుగవ రౌండ్ టెక్నికల్, ఆఖరి రౌండ్ హెచ్ ఆర్ జరిగిన తరువాత కంపెనీ 10 మంది విద్యార్థులను ఫైనల్ గ్రౌండ్లో సెలెక్ట్ చేశారు. సెలెక్ట్ అయిన విద్యార్థులందరికీ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ అనే డెసిగ్నేషన్ ఇచ్చారు. సెలెక్ట్ అయిన పదిమంది విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ రామకష్ణయ్య, వైస్ ప్రిన్సిపల్ ఐ.సాయిరాం, విద్యార్థులకు ఆఫర్ లెటర్స్ ఇచ్చారు. సెలెక్ట్ అయిన పదిమంది విద్యార్థులకు ఫిబ్రవరి మొదటి వారంలో కంపెనీలో జాయిన్ అవ్వాల్సిందిగా ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర సంతోష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. 100శాతం ప్లేస్‌మెంట్ లక్ష్యంగా పనిచేయాలి అని సెక్రటరీ డాక్టర్ మహేంద్ర నాథ్, ప్లేస్మెంట్స్ టీంకి ఆదేశాన్ని అందించారు. కాలేజీ చైర్మన్ మద్దులూరి మాల కొండయ్య కాలేజీ యాజమాన్యం సెలెక్ట్ అయిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపింది.

టివిఎస్ కంపెనీ రూ.50 లక్షల సాయం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశంలోని మూడవ అతిపెద్ద ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ, రాష్ట్రంలో విపత్తు సహాయక చర్యలకు రూ. 50 లక్షల విరాళాన్ని అందించినట్లు సంస్థ మేనేజింగ్ డైరక్టర్ సుదర్శన్ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత పట్ల కంపెనీ యొక్క అంకితభావాన్ని, సంక్షోభ సమయాల్లో కమ్యూనిటీలకు మద్దతు ఇవ్వడానికి కంపెనీకున్న నిబద్ధతను చూపుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన విపత్తు వల్ల ప్రతికూలంగా ప్రభావితమైన వారికి తక్షణ సహాయం, పునరావాసం అందించడానికి ఈ నిధులు వినియోగించబడతాయని అన్నారు. గతంలో కూడా తమ సంస్థ పలు విధాలుగా సహకారం అందించి నట్లు తెలిపారు.

కృష్ణా వర్సిటీ అథ్లెటిక్స్‌లో

జాకీర్, కెవిఆర్‌కు పతకాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఉయ్యూరులోని ఎ.జీ అండ్ ఎస్.జి సిద్ధార్థ కళాశాల ఆధ్వర్యంలో డిసెంబర్ 9,10,11వ తేదీలలో నిర్వహించిన కష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ (2023 -24) పోటీలలో పురుషుల విభాగంలో తమ కళాశాల టీం ఛాంపియన్షిప్ సాధించిందని జాకీర్ హుస్సేన్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన క్రీడలలో తమ కళాశాల విద్యార్థులు 9 బంగారు, 4 రజతం, 2 కాంస్య పతకాలతో 49 పాయింట్లు సాధించారన్నారు. మహిళల విభాగంలో షార్ట్ పుట్ విభాగంలో బంగారు పతకం, 4x100 రిలే లో కాంస్య పతకం సాధించారన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అబ్దుల్ హమీద్ ఖాన్ మాట్లాడుతూ జనవరిలో చెన్నైలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీలో జరగనున్న ఆల్ ఇండియా సౌత్ వెస్ట్ జోన్ ఛాంపియన్షిప్ పోటీలకు తమ కళాశాలకు చెందిన ఎ.రాజేష్ (తతీయ బికాం) 100, 200 మీటర్ల విభాగంలో, డి.గోపీచంద్ (తతీయ బికాం) 400 మీటర్ల పరుగు 400 మీ హర్డిల్స్, బి.శివగంగా (తతీయ బీకాం) 800మీ,1500మీ విభాగంలో, టీ.విజయ రామరాజు (తతీయ బీకాం) 100మీ పరుగు, 110 మీ హర్డిల్స్‌లో కష్ణా యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపేందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో ఆధ్యాపకులు మస్తాన్వలి, నాగుల్ మీరా, బందగీ బేగ్, ఆలీ దుర్గా భవాని, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నందిగామ : ఎన్టీఆర్ జిల్లా నందిగామ క్రిష్ణ యూనివర్సిటీ అథ్లెటిక్ మీట్‌లో కెవిఆర్ కాలేజీ విద్యార్థులు బంగారు, వెండి పథకాలు సాధించారు. ఈనెల 9 నుండి 11 వరకు క్రిష్ణ యూనివర్సిటీ అథ్లెటిక్ మీట్ పోటీలు ఉయ్యూరులో ఎజి అండ్ ఎస్ జిఎస్ కాలేజీలో నిర్వహించారు. సిహెచ్.భవానీ 5 కిలోమీటర్స్ వాక్‌లో గోల్డ్ మెడల్ 4x400 మీటర్స్ రిలేలో బ్రాంచ్ మెడల్ సాధించారు. నాగ పవన్ కుమార్ పది కిలోమీటర్లు రన్నింగ్‌లో, ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. పి.సూర్య ప్రకాష్ 5 కిలోమీటర్ రన్నింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. టి.మౌనిక పి.శిరీష 20 కిలోమీటర్లు రన్నింగ్‌లో సిల్వర్ మెడల్ బ్రాంచ్ మెడల్, 4X400లో బ్రాంజ్ మెడల్ సాధించారు. కె.రేవతి ఐదు కిలోమీటర్ల వాక్, 4X400లో బ్రాందీ మెడల్ సాధించింది. వీరికి కాలేజీ యాజమాన్యం యర్రంరెడ్డి బాబురావు, వాసిరెడ్డి గోపాలకష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయప్ప, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరావు, గేమ్స్ కమిటీ సభ్యులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలోని జాకీర్‌హుస్సేన్ కళాశాల విద్యార్థులు

నందిగామ కెవిఆర్ కళాశాల విద్యార్థులు

వాంబే కాలనీ న్యూ రాజరాజేశ్వరి పేటలో

ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసి వెంటనే పట్టాలివ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : 57, 60 డివిజన్లో ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసి వెంటనే పట్టాలివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బాంబే కాలనీ న్యూ రాజరాజేశ్వరి పేటలో మంగళవాంయాయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా ఎల్ఐ రిజిస్ట్రేషన్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికలు మళ్లీ దగ్గర పడటంతో ప్రజలను మోసం చేయడానికి రిజిస్ట్రేషన్ తనతో మొదలుపెట్టారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం వాంబే కాలనీ ప్రజలతో ఆటలాడుకుంటున్నారని. సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు దీనికి బాధ్యత వహించాలని అన్నారు. ఒక్కొక్క లబ్ధిదారుల వద్ద ఎల్ఐ రిజిస్ట్రేషన్ కోసం రూ.6 వేలకు పైగా వసూలు చేసి ఇప్పటివరకు పట్టాలివ్వలేదని మండిపడ్డారు. ఇంకొంతమంది వద్ద డాక్యుమెంట్స్ తీసుకొని ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారని వైసిపి ప్రభుత్వం వాంబే కాలనీ బ్యాంకర్ రుణాలు రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు బ్యాంకు రుణాలు కడితేనే ఇల్లు రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడం దారుణమన్నారు. కొంతమందికి ఇళ్ల పట్టాలు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితిని ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని చెత్త పన్ను ముక్కు పిండి వసూలు చేస్తున్నారని బ్యాంకు రుణాలు రద్దు చేయాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణ రావు కార్యవర్గ సభ్యులు కె.దుర్గారావు కమిటీ సభ్యులు ఎస్‌కె పేరు సిహెచ్ శీను ఎస్ అప్పన్న కె.రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

వేర్వేరు ప్రమాదాల్లో పాక దగ్ధం, చిన్నారికి గాయాలు

షాక్‌కు గురైన చిన్నారి

దగ్ధమైన ఇంటిని చూస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఊర్మిళ నగర్ పార్కు సెంటర్ సమీపంలో సోమవారం రాత్రి మోతుకూరి నాగుల్‌మీరా కుటుంబానికి చెందిన పూరిపాక అగ్నిప్రమాదానికి గురై ఇంట్లో దుస్తులు, వంట సామాగ్రి దగ్ధమయ్యాయి. అయితే వీరి ఇంటి పక్కనే మరో పాక కూడా ఉంది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఇంటి చుట్టపక్కల వారు వెంటనే స్పందించి నీళ్లు చల్లటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఫైరింజన్ సహాయంతో కూడా మంటలను అదుపుచేసినట్లు స్థానికులు చెబుతున్నారు. నాగుల్ మీరాకి చెందిన పూరిల్లు అగ్నిప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న స్థానిక 43వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దూది బ్రహ్మయ్య, స్థానిక నాయకులు కునికి కొండయ్య మంగళవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరిమర్శించారు. అనంతరం వెస్ట్ ఎంఆర్ఓ జాహ్నవి రెడ్డికి సమాచారం అందించారు. ఆమె మంగళవారం సాయంత్రం ఊర్మిళానగర్‌లోని అగ్నిమాదానికి గురైన పాకను పరిశీలించి, బాధిత కుటుంబం నుంచి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. కలెక్టర్ ఢిల్లీ రావు దష్టికి తీసుకు వెళ్లి తగిన న్యాయం చేస్తామని బాధితులకు ధైర్యం చెప్పారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ క్రిందకు ఉండటంతో చిన్నారికి షాక్

స్థానిక 50వ డివిజన్ బంకా కామరాజు వీధిలో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ చాలా కిందకి ఉండటంతో మంగళవారం శేషి వర్ధన్ (5) సంవత్సరాల పిల్లవాడికి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అయితే చేతికి చిన్న గాయం తప్పించి ఎటువంటి ప్రాణాపాయం కాకపోవటంతో స్థానికులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 50వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు కొప్పుల గంగాధరరెడ్డి వెంటనే అక్కడకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాధరరెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్ తగిలి ఒక పిల్లవాడికి పూర్తిగా చెయ్యి తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. 50వ డివిజన్ టిడిపి అధ్యక్షులు గంగాధర్ రెడ్డి ఈ విషయాన్ని వెంటనే విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్‌బాక్స్‌ను పిల్లలకు అందే విధంగా గాకుండా ఎత్తులో ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో మానసిక ఆరోగ్య పరిశీలన బోర్డులో పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్‌పర్సన్ 1 (ఒకటి) మెంబర్స్ 2 (రెండు) డిఇఒ 1 (ఒకటి) అటెండర్ 1 (ఒకటి) మొత్తం ఐదు పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు https://www.smcvja.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపల్ సుధాకర్ ఆ ప్రకటనలో తెలిపారు.

61వ డివిజన్‌లో వైసిపి కార్యక్రమం

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 61వ డివిజన్ 261వ వార్డు సచివాలయ పరిధి శాంతినగర్లో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో మంగళవారం డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వెంకట్రావుతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘన నివాళులర్పించి.. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టిడిపి ప్రభుత్వంలో ఎటు వంటి అభివద్ధి జరగలేదన్నారు. కానీ ప్రస్తుత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి జరుగు తుందన్నారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో డివిజన్లో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలే ఇందుకు నిదర్శన మన్నారు. గత తెలుగుదేశం హయాంలో పాయ కాపురం చెరువు ఆక్రమ ణలకు గురికాగా.. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 3.71 కోట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది ప్రారంభించు కున్నట్లు ఎమ్మెల్యే వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మోహన్ బాబు, నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గహ సారథులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విష్ణు, తదితరులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.